# శ్రమించారు.. సాధించారు

- సిర్గాపూర్‌లో ఒకే ఇంట్లో నలుగురికి నౌకరి
- భార్యభర్తలకు వరించిన జాబ్
- జమ్లాతండా 8, లక్ష్మణ్‌నాయక్‌తండా జీపీలో ఏడుగురికి ఉద్యోగాలు



అందోల్: ఉద్యోగం సాధించిన స్నేహితులు మహేశ్, లక్ష్మణ్



న్యాల్‌కల్ : కానిస్టేబుల్‌గా ఎంపికైన సీహెచ్ శివకుమార్

సిర్గాపూర్, అక్టోబర్ 5 : మండలంలో కానిస్టేబుల్ కొలువుల పంట పండింది. తెలంగాణ సర్కారు ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలంలోని వివిధ గ్రామాల్లో కలిపి దాదాపు 40కి పైగా అభ్యర్థులు సత్తా చాటి ఉద్యోగాన్ని సంపాదించారు. ఒక్క జమ్లాతండాలోనే 8మంది కాగా లక్ష్మనాయక్‌తండా జీపీలో ఏడుగురికి, కడ్పల్‌లో ఐదుగురు, ఖాజాపూర్‌లో నలుగురు, సిర్గాపూర్‌లో నలుగురు, వాసర్ పరిధిలో ఐదుగురు, మరికొన్ని గ్రామాల్లో, తండాల్లో ఒకరిద్దరికి ఉద్యోగాలు వచ్చాయి. అత్యధికంగా గిరిజన తండాలకు చెందిన అభ్యర్థులే కావడం విశేషం. సీఎం కేసీఆర్ సర్కారులో ఊహించని తీరులో కొలువులు కొట్టేశారు. పట్టుదలతో సాధించిన వారి కృషి ఫలించడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తమ ఎంబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిపేర్ అయ్యే వారి కోసం ఉచితంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులోని నుంచి కొందరు ఎస్ఐకి ఎంపికవగా మరికొంతమంది కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు.

**ఒకే ఇంట్లో నలుగురికి కొలువులు..**

సిర్గాపూర్ మండలంలోని జమ్లాతండా గ్రామ పంచాయతీలో ఒకే ఇంట్లో నలుగురికి కానిస్టేబుల్ కొలువులు వచ్చాయి. గ్రామానికి చెందిన మెగావత్ నెహ్రూనాయక్ మారోనిబాయి దంపతుల కుమారులు రమేశ్, సంతోష్, కూతురు రేణుక, కోడలు మలోత్ రోజా పట్టుదలతో పోలీసు ఉద్యోగం సాధించారు. ఇందులో సంతోష్, రోజాలు ఏఆర్ కానిస్టేబుల్ కాగా, రమేశ్ టీఎస్ఎస్‌పీఎస్, రేణుక సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దీంతో వారి ఇంట్లో ఆనందం నింగికెగిసింది.

**భార్యాభర్తలకు పోలీసు కొలువు**

మండలంలోని జమ్లాతండా జీపీలోని తోల్యాతండాకు చెందిన భార్యభర్తలు రాథోడ్ రాజు, వడిత్య సక్కుబాయి ఇద్దరు కొలువు కొట్టారు.

భర్త రాజు ఎంఎస్సీ చదివి స్పెషల్ పోలీసు సాధించగా, భార్య బీఏ చదివి ఏఆర్ కానిస్టేబుల్ నౌకరికి ఎంపికైంది. ఇదే తండాకు చెందిన సు రేశ్ సివిల్ పోలీసు అయ్యాడు. ఇదే జీపి సర్పంచ్ సోదరుడు ఉదయ్‌కిరణ్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

**లక్ష్మణ్‌నాయక్‌తండా జీపీలో ఏడుగురు ఎంపిక**

లక్ష్మణ్‌నాయక్‌తండా పరిధిలో మొత్తం ఏడుగురు పోలీసు ఉద్యోగం సాధించారు. ఇందులో కోలా తారాసింగ్, శ్రీకాంత్, నెహ్రూ, సురేశ్ స్పెషల్ పోలీసు కాగా సురేశ్, రాజు సివిల్‌కు ఎంపికయ్యారు.

**సివిల్ కానిస్టేబుల్‌గా శివకుమార్**

న్యాల్‌కల్, అక్టోబర్ 5 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువతీ, యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించారు. మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన శివకుమార్, భవానీ, గీత, న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బాలకృష్ణ, అశోక్, సంతోష్, మల్కన్‌పాడ్‌కు చెందిన సురేశ్, డప్పూర్‌కు చెందిన మన్నెల్లి సిద్దులు పలు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

**కానిస్టేబుల్స్‌కు ఎంపికైన యువకులు**

అందోల్, అక్టోబర్ 5: మండలంలోని తాడ్మనూర్ నుంచి నలుగురు యువకులు సదానందం, సందీప్, నందు, భానుచందర్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అందోల్ నుంచి శ్యాంకుమార్, జంగిలి పవన్, పోతిరెడ్డిపల్లి నుంచి ఆదర్శ్, సాయిబాన్‌పేట్‌కు చెందిన నరేందర్‌గౌడ్, మాసాన్‌పల్లి నుంచి లక్ష్మణ్ కానిస్టేబుల్‌గా ఎంపికవ్వగా కుటుంబ సభ్యు లు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు వారిని అభినందించా రు. వట్‌పల్లి మండలం దరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన మహేశ్, లక్ష్మణ్ ఇద్దరు ఉద్యోగాలు సాధించారు.

**పట్టు బట్టారు.. విజయం సాధించారు**

నాగల్‌గిద్ద, అక్టోబర్ 5: మండలంలోని కరస్‌గుత్తి గ్రామానికి చెందిన అన్నా చెల్లెలకు పోలీసు ఉద్యోగం సాధించారు. అన్నా భీమ్‌రావ్ ఎస్సై ఉద్యోగం సాధించగా, చెల్లెలు రాధిక కానిస్టేబల్ సాధించింది.

**ఒకే గ్రామం నుంచి ఏడుగురు ఎంపిక**

మనూరు, అక్టోబర్ 5: మండలంలోని బోరంచ గ్రామానికి చెందిన ఏడుగురు అభ్యర్థులు కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో బుడుగుల మల్లేష్, గౌని రాజు, మంగ వంశీ, గౌని కార్తిక్, శివ, శంకర్, బేగరి అనిత ఎంపిక కావడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లువిరిసింది. మనూరు గ్రామానికి చెందిన తోర్నల్ తుకారం కానిస్టేబుల్‌కు ఎంపికవడంతో ఎంపీడీవో షాజీలోద్దీన్, ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ శాలువ పూలమాలతో సన్మానించారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలకు బాలికలు ఎంపిక

కల్హేర్ అక్టోబర్ 5: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 4న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్14 విభాగంలో కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికల రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడాలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాంమోహన్‌రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖోఖో క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి ఎంపికైన రమావత్ సోని, జనుముల వర్ష ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ నెలలో కోమరం భీమ్ జిల్లా ఆసీఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో వీరు పాల్గొనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రీడల్లో ప్రతిభ మెలుకువలు నేర్పిన పీఈటీ రాములుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.



బాలికలను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

## విధి నిర్వహణలో ఉద్యోగుల బాధ్యత గొప్పది

సంగారెడ్డి, అక్టోబరు 5 : పోలీసుశాఖలో 20ఏండ్లుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన భాగ్యవతి సేవలు గొప్పవని, హోంగార్డును ఎస్పీ రమణకుమార్ సత్కరించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో భాగ్యవతి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఎస్పీతో సన్మానం పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వంలో పని చేసే ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేసి 2018 నుంచి సఖీ కేంద్రంలో విధులు నిర్వహిచి మంచిపేరు సంపాదించిందన్నారు. పోలీస్‌శాఖ తరుపున వారి కుటుంబానికి సహాయ, సహకారాలు అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ జనార్దన్, ఎస్.బి.ఇన్‌స్పెక్టర్లు శివలింగం, విజయ్‌కృష్ణ, ఆర్ఐలు రామరావ్, హన్మిరెడ్డితో పాటు హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డు భాగ్యవతిని సత్కరించిన ఎస్పీ రమణకుమార్

## క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన అందోల్ విద్యార్థులు

అందోల్, అక్టోబర్ 5 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల్లో అందోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభను చాటి 8బంగారు, 2రజత పతకాలు సాధించి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రత్నరాజు తెలిపారు. ఇటీవల సిద్దిపేటలో ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన అమృత, నీరజ, దీపిక, మధుప్రియ, కీర్తన, రవళీ, నిఖిత, స్వాతి అండర్-17 విభాగంలో ప్రతిభను చూపగా.. అండర్-14లో శరణ్య, రజితలు ఉత్తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ మౌనిక, కోచ్ వాసు, వైస్ ప్రిన్సిపాల్స్ అజ్మత్‌బేగం, స్వర్ణలత, సూపరింటెండెంట్ గంగాధర్‌స్వామి పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలపై ప్రభుత్వం దృష్టి

మునిపల్లి, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాలపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ శైలజాశివశంకర్, జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామాలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు మండలస్థాయి నుంచి మొదలుకొని దేశస్థాయిలోనూ విజయాలు సాధించే దిశగా పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి చిన్నారులను ప్రోత్సహించడంతోనే చిన్నారులు క్రీడల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో సర్పంచ్, ఎంపీటీసీ ఉన్నారు.

## నేడు జోగిపేటలో అల్పాహారం ప్రారంభం


అందోల్, అక్టోబర్ 5: నేడు జోగిపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ తిరుపతి గురువారంఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30గంటలకు కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## నారింజవాగులో పడి వ్యక్తి మృతి

కోహీర్, అక్టోబర్ 5 : కోహీర్ పట్టణానికి చెందిన బోయిని శేఖర్(35) ప్రమాదవశాత్తు నారింజ వాగులో పడి మృతిచెందాడు. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. కోహీర్‌కు చెందిన బోయిని శేఖర్ గురువారం ఉదయం కూలీపని కోసం కోహీర్-పోతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఉన్న నారింజవాగు వద్దకు వెళ్లాడు. వాగు పక్కన ఉన్న రాళ్లపై నుంచి వెళ్తుండగా కాలు జారి వాగులో పడిపోయాడు. నీటిలో ఉన్న రాళ్లు బలంగా తలకు తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేశ్ వివరించారు.

## ఉపాధిహామీలో కొబ్బ రి మొక్కలు పెంపకం

కల్హేర్, అక్టోబర్ 5: మండల కేంద్రానికి చెందిన రైతు పోచబోయిన నారాయణ పొలం గట్లపై కొబ్బరి మొక్కలను ఉపాధిహామీ పథకం కింద నాటినట్లు టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్‌లో పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ మేరకు కొబ్బరి మొక్కలు నాటేందుకు నారాయణ ముందుకురావడంతో 40మొక్కలను ఉపాధిహామీ కింద అందజేసినట్లు చెప్పారు. గుంతలు తవ్వి నాటిన ప్రతి మొక్కకు రూ.200, ప్రతి నెలకు ఒక మొక్క పెంపకానికి రూ.11చెల్లిస్తామని టీపీ తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు రఘువీర్ ఉన్నారు.



కొబ్బరి మొక్కలు నాటుతున్న రైతు

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

హత్నూర, అక్టోబర్ 5 : ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర లేబర్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం హత్నూరలో బతుకమ్మ చీరలు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు.

గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు టోర్నమెంట్‌లు నిర్వహిస్తూ క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో శారదాదేవి, ఎంపీవో సువర్ణ, మండల ప్రత్యేకాధికారి స్వప్నతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర లేబర్‌వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి



కోహీర్ : కొత్తూర్‌లో చీరెలను అందజేస్తున్న పంచాయతీ అధికారి రఘు, బీఆర్ఎస్ నాయకులు



న్యాల్‌కల్ : బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మతంశెట్టి వీరామణీ

## ఆసానికుంటలో పీసీబీ అధికారులు విచారణ

బొల్లారం, అక్టోబర్ 5 : ఆసానికుంట ప్రధాన కాలువలో రెండు రోజుల కిత్రం గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలకు సంబంధించిన 40బ్యాగులను పారవేయడంపై వచ్చిన ఫిర్యాదులపై పీసీబీ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పీసీబీ అధికారులు రవీందర్, గౌతమి కుంటను సందర్శించి తనిఖీ చేశారు. కుంటలో పారవేసిన రసాయన ఘన వ్యర్థాల బ్యాగులను తొలగిస్తామన్నారు. సేకరించిన శాంపిల్స్ ఆధారంగా విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రసాయన వ్యర్థాలు ఎవరు పడేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.